కథ

# ఇది మాయాలోకం

- భమిడి వెంకటేశ్వర్లు

**ఇప్పటికీ** ఆ విషయం గురించి గత కొన్నేళ్ళుగా ఆలోచిస్తూనే ఉన్నాడు శ్రీరావు. అంతకు ముందు నుంచీ వున్నదే అది. మధ్యలో బ్రేక్. ఇప్పుడు తిరిగి చేసే వరకూ ఎప్పుడు చేయాలి! చేసావ్, ఎందుకు చేసానా అని! మరోలా చేసి వుండాల్సిందేమో అన్న ఆలోచన, ఆందోళన!

సోఫాలో కూర్చుని గుమ్మం బయటకు చూస్తూ నిర్లిప్తంగా ఆలోచనలు! ప్రస్తుత సమస్య మరీను! గత ఎనిమిది నెలలుగా ఇల్లు ఖాళీగా వుంది. అద్దె లేదు, ఎంతో నష్టం! అయిదువేలు పైనే! ఇంతకు ముందు ఒక వాటాలో తనుంటూ, మరొక వాటాను అద్దెకు యిచ్చాడు శ్రీరావు. పొరపాటో, గ్రహపాటో - పాతికేళ్ళ క్రితం చేయనిది, చేయలేనిది యిప్పుడు చేసాడు - ఫస్టు ఫ్లోరు నిర్మించటం అది పూర్తయ్యాక, తను అందులోకి మారాడు. ఫలితంగా క్రింది రెండు వాటాలు అద్దెకోసం నిరీక్షించటం! అది సమస్యో, ఆలోచనో అర్థంకాదు.

నిజానికి తనదగ్గర డబ్బుండి ఫస్ట ఫ్లోరు నిర్మించలేదు శ్రీరావు. బ్యాంకు నుంచి నాలుగు లక్షలు, అప్పు తీసుకున్నాడు. మరో రెండు లక్షలు తన దగ్గరున్నది కలిపి ఓ ఆకారం తెచ్చాడు. రెండు నెలల తరువాత ఒక వాటా అద్దెకిచ్చాడు. రెండోవాటా ఖాళీగానే వుంది. బ్యాంకుకి ప్రతినెలా ఆరువేల అయిదొందలు బాకీ వాయిదా కట్టాలి. రెండు నెలలు చాలా టెన్షను ఫీలయ్యాడు తను. అంత సొమ్ము బ్యాంకుకి కట్టడం అంటే మాటలా! రెండు వాటాలు అద్దెకిస్తే సమస్య వుండదు కొంత వరకు అనుకున్నది అనుకున్నట్టుగా జరగకపోతే!

శ్రీరావుకి ఏం చేయాలో అర్థం కావటంలేదు. భార్య కాఫీ తెచ్చిపెట్టింది. "టి.వి. చూడకుండా బయటకు చూస్తున్నారేంటి అని అడిగింది.

"చాలా చికాగ్గా వుంది. ఏం తోచటంలేదు. పొరపాటు చేశానేమోననిపిస్తోంది. హాయిగా వున్న జీవితంలో కొత్త సమస్యని తెచ్చుకున్నాననిపిస్తోంది" అన్నాడు శ్రీరావు కాఫీ తాగుతూ.

నిజానికి ఆమె కూడా ఆ సమస్య గురించే ఆలోచిస్తోంది. ఆ విషయంలో దంపతులు ఘర్షణ పడుతుంటారు. కాని పరిష్కారం లేదు. "పూర్తి జీతం బాంకుకే కట్టేస్తే యిక యిల్లు ఎలా గడుస్తుంది. బాకీలు ఎలా తీర్చాలి! మనకేమైనా డాలర్లు వచ్చి పడుతున్నాయా!" అన్నాడతను.

"న్యాయానికి, మంచితనానికి రోజులు కావు. అందరూ మీలాగే ఎదుటివారి గురించి ఆలోచించి, చేతులు కాల్చుకోరుగా! మీరు పొరపాటుచేస్తున్నారు" అందామె మామూలు ధోరణిలోనే. "ఇల్లు చూసినవాళ్ళు - అడ్వాన్సు యిస్తుంటే, చేరేటప్పుడు యివ్వండి అనటం మూర్ఖత్వం అవుతుంది. అదే మీరు చేస్తున్న పొరపాటు. ఒకసారి అడ్వాన్సు యిచ్చినవాడు మనసు మార్చుకోడు. ఒకవేళ మార్చుకుంటే నష్టపోయేది వాళ్ళే! వచ్చినంత వరకూ దండు కోవటమే నేటి ఫిలాసఫీ!" తనే తిరిగి అంది.

"అది నాకు నచ్చదని తెలుసుగదా"

"అందుకే అనుభవిస్తున్నారు కదా"

దమయంతి అనే ఆవిడ అదే కాలనీలో యిరవై యేళ్ళుగా వుంటూ - ఎనిమిదిళ్ళు మారింది. "మీయిల్లు అద్దెకిస్తారని తెలిసింది చూసేందుకు వచ్చాను" అంటూ ఓ రోజు చనువుగా వచ్చింది.

"చూస్తారా అయితే" అన్నాడు శ్రీరావు.

అతనిలో రకరకాల ప్రశ్నలు. రకరకాలుగా ప్రశ్నలతో బుర్రతినేసింది. అన్నిటికీ ఓపిగ్గా బదులిచ్చాడు తను.

"ఇల్లు ఎవరికీ యివ్వకండి, మేమే తీసుకుంటాం. రేపు మా ఆయన వస్తారు. అడ్వాన్సు యిస్తారు" అంది దయమంత్రి గ్రీన్ సిగ్నలు యిస్తూ.

నిజానికి దమయంతి యిల్లు చూస్తుండగానే ఎవరో యింటి కోసం వచ్చారు. "మేము తీసేసుకున్నాం" అంది దమయంతి వారితో.

అవునన్నట్లుగా చూశాడు శ్రీరావు.

రెండు రోజుల తరువాత దమయంతి కూతురుతో వచ్చి యిల్లు చూసింది, మర్నాడు మొగుడితో వచ్చింది. తరువాత అత్తమ్మతో వచ్చింది. మరో రోజు తోడి కోడలుతో వచ్చింది. ఇంటికి రంగు వేయించమంది. ఇంకా ఏవో ఏవో కోరింది. అన్నిటికీ 'ఓకే' అన్నాడు శ్రీరావు- ఇంట్లోకి దమయంతి వస్తున్నందుకు.

నెలరోజుల్నుంచీ ఆ యింటి కోసం సావిత్రి, గోపాలరావు, సుహాసిని మొదలైనవారు వచ్చి చూశారు. "మళ్లీ వస్తాం" అన్నారు వాళ్ళు. కాని రాలేదు.

అందుకే శ్రీరావులో చికాకు, బెంగ ఆందోళన!

నిజానికి యిళ్ళ విషయంలో అప్పటికి, ఇప్పటికీ చాలా మార్పులు వచ్చాయి. ఇప్పుడు యిళ్ళ కొరత లేదు. అరగంట సర్వేచేస్తే, మూడు నాలుగిళ్ళు దొరుకుతాయి. అందుకు కారణం అపార్టుమెంట్లే! మనుషుల్లో అభిరుచులు, ఆలోచనలు ఎప్పటికప్పుడు మారిపోతుండటంతో, చాలా మంది అపార్టుమెంట్లకే ఎగబడుతున్నారు - ఏ ఫ్లోరు అయినా ఫరవాలేదనుకుంటూ! ఆకర్షణగా, సౌకర్యాలతో ఫోనులతో - పైగా వాచ్‌మన్ / సెక్యూరిటీ సౌకర్యం ఉండటంతో!

కాబట్టి శ్రీరావు లాంటి వారి యిళ్ళు ఖాళీగా వుంటున్నాయి. మునుపటిలా ఇళ్ళ కొరతలేదు. అద్దెలు అధికంగానూ లేవు!

పదిహేను రోజుల తరువాత దమయంతి పని మనిషి చేత కబురు చేసింది "రావటంలేదు" అంటూ! కారణం శ్రీరావు అడగలేదు.

తరువాత దమయంతి మొగుడు కూడా రోడ్డుమీదో, గుళ్ళోనూ, నూవరు బజారు దగ్గర కనిపించినా, ఇంటి గురించి టచ్ చేయకపోవటం విశేషం! పైగా 'సైలెన్స్' కనబరచటం మరో హైలైట్!

"మీరు అడ్వాన్సు తీసుకోలేదు కాబట్టి దమయంతి మనకు టోపీ పెట్టింది-నమ్మించి" అంటూ భార్య మందలించింది.

శ్రీరావుకి నిజమేననిపించింది.

మనం రాజకీయ నాయకులను, పాలకులను సాధించనవసరంలేదు. మాట నిలుపుకోరని! వాగ్దానాలని మరిచిపోతారని! వారికన్నా మనం చాలా ముందుగానే ఉన్నామేమో!

శ్రీరావు కాలనీలోనే రోజుకో కొత్త టులెట్ బోర్డు చూస్తున్నాడు. అతనిలో సహనం నశించిపోతోంది, నిర్లిప్తత పెరిగిపోతోంది.

'ఇక మీదట అడ్వాన్స్ తీసుకోవాల్సిందే' అనుకున్నాడు శ్రీరావు.

కొందరి జీవితాలు యిలాగే వుంటాయి - నీరసంగా నిర్లిప్తంగా, నిరాశగా! తనలాటివారు ఎంతో హాయిగా, హుందాగా గర్వంగ్గా, ధీమాగా వున్నారు అని శ్రీరావు ఆలోచనలు.

నాలుగు రోజుల తర్వాత అతనికి అసలు విషయం తెలిసింది - దమయంతి ఇల్లు అప్పుడే మారిందని! అది కూడా తన వీధిలోనే! ఆశ్చర్యం! ఆందోళన!

ఒకరోజు శ్రీరావు ఎవరికో ఇల్లు చూపిస్తుంటే వచ్చింది దమయంతి!

శ్రీరావు అంతగా పట్టించుకోలేదు.

"ఓసారిలా వస్తారా" అని అడిగింది దమయంతి.

"లోపల మా ఆవిడ వుంది, వెళ్ళి మాట్లాడండి- అన్నాడు అతను.

ఆమెలో కంగారు, ఆందోళన గమనించాడు శ్రీరావు. ఆవిడ రాకలోని ఆంతర్యం తను గ్రహించాడు.

"అయినా మీరొచ్చారేంటి? పనిమనిషిని మాన్పించేశారా" అన్నాడు అతను.

దమయంతిలో కంగారు కనిపిస్తోంది - 'ఒక్కసారిలా రండి' అంది తను మళ్లీ.

"చెప్పండిక్కడ, ఫరవాలేదు" అన్నాడు శ్రీరావు.

"నాకు మీ యిల్లు కావాలి... ఇదిగో అడ్వాన్సు" అంటూ పర్సు తీసింది తను.

"చూడండి, నేను మాటని, అవసరాన్ని గౌరవిస్తాను కాని అవకాశాన్ని కాదు. మీరు పనిమనిషిచేత కబురు చేయడం బాగోలేదేమో! మీ మీద మీకు నమ్మకం లేనట్టుగా నాకు అనిపించింది. అది పద్ధతికాదు. ఆ సంగతి మీ మనసుకూ తెలుసు! అయినా మీరు యింత హడావిడిగా ఎందుకు వచ్చారో నాకు తెలుసు" అన్నాడు నిశ్చయంగా.

దమయంతి ఆశ్చర్యపోయింది.

"మీ యింటి యజమానికి మీ పద్ధతులు నచ్చక, యిల్లు ఖాళీ చేయమన్నాడు. మీ భేషజాలు, గొప్పతనం మీకు బలం కావచ్చు. ఎదుటివారికి అవసరంలేదు. అందుకే ఆయన యిల్లు అమ్మేస్తానని యిల్లు ఖాళీ చేయమని చెప్పాడు. నిన్న, మీరు పనిమనిషితో చూసిన ఇళ్ళున్నాయిగా" అన్నాడు.

ఆవిడ షాక్ తింది. శ్రీరావులాంటి వారిని అవమాన పరచడం... ఫలితంగా తను నష్టపోయింది... తెలియకపోలేదు. తన తెలివితేటలు తనకే ఎసరు పెట్టాయనిపించింది.

"సారీ! మీకు యిల్లు ఇవ్వలేను, ఖాళీగా వున్నా ఫరవాలేదు" అన్నాడు శ్రీరావు నిశ్చయంగా.

దమయంతికి పగలే చీకట్లు కమ్మేశాయి. *